మినీ ట్యాంక్‌బండ్ పనుల్లో నిర్లక్ష్యం

- నాణ్యత పాటించని కాంట్రాక్టర్
- దృష్టిసారించని ఇరిగేషన్ అధికారులు
- రూ.1.50 కోట్లు మంజూరు



నాసిరకంగా మెట్ల నిర్మాణ పనులు



నాణ్యత లోపించిన చెరువు కట్ట పనులు

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువుపై మినీట్యాంక్‌బండ్ నిర్మాణం కోసం రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయికల్‌లో మినీట్యాంక్ బండ్ నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధుల ద్వారా కట్ట వెడల్పు, రాయి అద్దకం, పార్క్ డెవలప్‌మెంట్, కర్బ్స్‌వాల్, రేలింగ్, మెట్ల నిర్మాణం, రిటర్నింగ్ వాల్ పనులు చేపట్టాల్సి ఉంది.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కట్ట వెడల్పు 8 మీటర్లు నిర్మించాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా మెట్ల నిర్మాణ పనులు, రిటర్నింగ్ వాల్‌లో కూడా పూర్తి అయినప్పటికీ పనుల్లో నాణ్యత లోపించి ఇప్పుడే కంకర తేలుతోందని స్థానిక ప్రజలు కాంట్రాక్టర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత లోపించిన పనులను పర్యవేక్షించి పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పనులను పర్యవేక్షించాలి



రాయికల్ పెద్ద చెరువుపై చేపడుతున్న పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించింది. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. – మ్యాకల అనురాధ, కౌన్సిలర్

నాణ్యత లోపిస్తే చర్యలు



రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువుపై చేపడుతున్న ట్యాంక్‌బండ్ పనుల్లో నాణ్యత లోపిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. అన్ని పనుల్లో నాణ్యత పాటించాలి. – భాస్కర్, ఇరిగేషన్ డీఈ

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



జగిత్యాల: సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న శ్రీపాద నరేశ్



కథలాపూర్: సిరికొండలో ప్రయోగాల ప్రదర్శన



ధర్మపురి: దోనూర్ ప్రభుత్వ పాఠశాలలో..



వెల్గటూర్: ప్రాజెక్టులతో విద్యార్థులు, టీచర్లు



జగిత్యాల: చైతన్య స్కూల్‌లో ప్రదర్శనలు

జగిత్యాల/కోరుట్లటౌన్/కథలాపూర్/రాయికల్/మల్యాల/ధర్మపురి/వెల్గటూర్: సైన్స్ అంటేనే పరిశీలన, ప్రయోగాలు అని వక్తలు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్‌లో శాస్త్రవేత్తలు కావాలని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

బీజేపీతోనే సంక్షేమ పాలన సాధ్యం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొడిమ్యాల: బీజేపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బీజేపీ ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ ఏలేటి మమత, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనాలపై దృష్టిసారించాలి



పరిశీలిస్తున్న ఎంపీపీ సంధ్యారాణి

రాయికల్: గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలపై దృష్టిసారించాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఒడ్డెరకాలనీ, ఒడ్డెలింగాపూర్ గ్రామల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పల్లెప్రకృతి వనం, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ఆదర్శ గ్రామాలుగా నిలపాలన్నారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఎంపీవో సుష్మ, ఏపీవో దివ్య పాల్గొన్నారు.

ఘనంగా గొల్లకేతమ్మ జాతర



జాతరకు తరలివచ్చిన భక్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రంగసాగర్, రాయికల్ మండలం కట్కాపూర్ సరిహద్దుల్లో ఉన్న శ్రీ గొల్లకేతమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏసీడీసీ నిధులు రూ. 4.80 లక్షలతో ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఆలయ వార్షిక వేడుకలు

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో అనుబంధ ఆలయంగా ఉన్న శ్రీవేంకటేశ్వర పద్మావతి, అలివేలుమంగ ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా స్వామివారి కల్యాణం వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈవో కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య పాల్గొన్నారు. కాగా బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం జరగనుంది.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

మేడిపెల్లి: భీమారం మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్ రావుతో కలిసి దర్శించుకున్నారు. సాయగౌడ్, శంకర్ గౌడ్, ఎంపీటీసీ అర్జున్, రాజు, మల్లేశం, రఘు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఘనంగా ఎల్లమ్మ జాతర

కథలాపూర్: మండలంలోని తాండ్రియాలలో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఆలయంలో ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నదానం కోసం 6 క్వింటాళ్ల బియ్యం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ గంగప్రసాద్ పాల్గొన్నారు.

✦ఆటోడ్రైవర్లకు గుర్తింపుకార్డులు

మెట్‌పల్లి: పట్టణంలోని డిపో చౌరస్తా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు మంగళవారం గుర్తింపు కార్డులు అందజేశారు. అధ్యక్షుడు రంగు సంపత్ గౌడ్, ఐలయ్య, రాంచంద్రం, అంజి, పోచ య్య, రాజయ్య, యాదగిరి, నారాయణ, నరేందర్ ఉన్నారు.

✦గొర్రెలకు నట్టల నివారణ మందు..

మేడిపెల్లి: మండల కేంద్రంలో మంగళవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. వెటర్నిటీ అసిస్టెంట్ లచ్చయ్య, ఎంపీపీ ఉమాదేవి, ఎంపీటీసీ మకిలిదాసు, క్రిష్ణ, మల్లేశ్, గణేశ్ పాల్గొన్నారు.

✦కంటివెలుగు పథకం పర్యవేక్షణ

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్, రేగుంట గ్రామాల్లో కంటివెలుగు పథకాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఒబులాపూర్‌లో దివ్యాంగులకు వారి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రాహుల్‌శర్మ, హెల్త్ సూపర్‌వైజర్లు ఇందిర, శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

✦బ్యాంకు సేవలు వినియోగించుకోండి

కథలాపూర్: కేడీసీసీ బ్యాంకుల్లో అన్నిరకాల సేవలు అందిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కేడీసీసీ బ్యాంక్ కథలాపూర్ బ్రాంచ్ మేనేజర్ రఘునాథ్ శర్మ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని భూషణరావుపేటలో కేడీసీసీ బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వర్‌రావు, సింగిల్‌విండో సీఈవో ఉశకోల అరుణ్, విజయ్, రవి, బాను పాల్గొన్నారు.

✦గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం

పెగడపల్లి: మండలంలోని కీచులాటపల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ రవి, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జనార్దన్, ఎస్సై రామచంద్రం, ఎంఈవో ఆనందరావు, సర్పంచ్ మొలిగె లక్ష్మి పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో ఆర్‌ఐ రాజేశ్, సర్పంచ్ పాలెపు దిలీప్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్‌లో తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, సర్పంచ్ దాసరి పోశెట్టి పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని కప్పారావుపేటలో ఆర్‌ఐ రాజేశ్వరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు



వరిపంటను పరిశీలిస్తున్న ఏవో నాగమణి

మల్లాపూర్: వరిసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరిపంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి వరిసాగులో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పిలకలు వేసే దశ, పూత, గింజ గట్టిపడే దశలో ఆశించి వరిపంటను నష్టపరుస్తాయని వివరించారు. ఈ దశలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపడితే వరిధాన్యంలో నాణ్యత పెరిగి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. రైతులు చిన్నయ్య, దిలీప్, నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్మశాన వాటిక నిర్మాణానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఆరె కటిక సంఘం శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని సంఘం నాయకులు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌కు ఫోన్‌చేసి ప్రభుత్వ స్థలం ఉంటే పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రాయికల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదలలో చేస్తున్న ఆలస్యంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి హరీశ్, నాయకులు నవీన్, శ్రావణ్, కార్తీక్, మనోజ్, అరవింద్, శశి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: మండలంలోని పూడూరులో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణోత్సవంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించి, జ్ఞాపిక బహూకరించారు. గ్రామ సర్పంచ్ పెద్ది కవిత, సింగిల్‌విండో చైర్మన్లు బండ రవీందర్‌రెడ్డి, మేనేని రాజనర్సింగ్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, నాయకులు కిరణ్, రవీందర్, లింగగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న సింహాచలం జగన్

వెల్గటూర్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంహాచలం జగన్ సూచించారు. ఈ మేరకు ఎండపల్లి మండలశాఖ సర్వసభ్య సమావేశాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం కొత్తపేటలో నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. ప్రతీ కార్యకర్త తమ బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపేట అధ్యక్షుడు మామిడిపల్లి రామయ్య, మండల ఉపాధ్యక్షుడు కోడి గంగయ్య, మండల కార్యదర్శి పడిదం వెంకటేశ్, మాజీ సర్పంచ్ గోపాల లచ్చయ్య, మాజీ ఎంపీటీసీ బూరగడ్డ లచ్చయ్య పాల్గొన్నారు.

శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాలు



అమ్మవారికి పుట్టదని కార్యక్రమం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారుల్లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాలు (జాతర) ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి పుట్టదని కార్యక్రమం నిర్వహించారు. లంద నుంచి ఎల్లమ్మ తల్లిని ఎదుర్కొని బోనాలు సమర్పించారు.

అటెన్షన్ ప్లీజ్



గోదావరి తీరం.. చెత్తమయం

ధర్మపురి: గోదావరిలో భక్తులు స్నానాలు చేసే ప్రదేశంలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ధర్మపురి పవిత్ర గోదావరిలో నిత్యం వేలాది మంది భక్తులు స్నానం చేస్తుంటారు. గోదావరిలోని మంగలి గడ్డ పుష్కరఘాట్ వద్ద నీటిలో ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, చెత్త పేరుకుపోయి ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి నీటిలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి
ఫోన్ నంబర్ : 88866 49051

రాష్ట్రం ఏర్పాటయ్యాకే జగిత్యాల అభివృద్ధి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: రాష్ట్రం ఏర్పాటయ్యాకే జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.6.10 లక్షల విలువ గల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటల కరెంట్‌తో ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిందన్నారు. జిల్లాలో నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలన సౌలభ్యం కల్పించినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం..

జగిత్యాలఅగ్రికల్చర్: కేసీఆర్ సీఎం అయిన తర్వాత ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు, ప్రతి వాడలో అభివృద్ధి జరుగుతున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజు, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి, సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ గంగయ్య, నాయకులు బాల ముకుందం, రవీందర్ రెడ్డి, సత్తిరెడ్డి, రాజిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



మాట్లాడుతున్న ఎర్రం మహేశ్

కథలాపూర్: ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అవినీతిమయమైన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎర్రం మహేశ్ ప్రజలను కోరారు. ఈ మేరకు మంగళవారం కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమాన్ని విస్మరించి నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పిడుగు ప్రతాప్‌రెడ్డి, గంగ్ర విజయ్, తోకల వినోద్, మామిడిపెల్లి ప్రవీణ్, వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, బద్రి సత్యం, సునీల్, గణేశ్ పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ పేరుతో మోసం



మాట్లాడుతున్న కృష్ణహరి

జగిత్యాలటౌన్: బంగారు తెలంగాణ ఆశ చూపి ప్రజలను మోసం చేసిన కేసీఆర్ తాను మాత్రం బంగారు కుటుంబాన్ని నిర్మించుకున్నారని బీజేపీ బల్దియా ఫ్లోర్ లీడర్, 20వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల కృష్ణహరి ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలోని శక్తి కేంద్రం ఆధ్వర్యంలో 20వ వార్డులోని బూత్ నంబర్ 159, 160లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం విడుదల చేస్తున్న రూ.వేలాది కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, పట్టణ శాఖ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆనందం



ఆనందంతో జిల్లా నాయకులు

రాయికల్: ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయికల్ మండలం మైతాపూర్‌కు చెందిన గంప ఆనందం, రాజకీయ కమిటీ చైర్మన్‌గా రాయికల్‌కు చెందిన ఎలగందుల సత్యనారాయణ, జిల్ల ఉపాధ్యక్షునిగా చింత అశోక్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఇటిక్యాలకు చెందిన పిప్పరి గంగాధర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేశ్ నియామక పత్రం అందించారు. ఈ మేరకు మంగళవారం వీరిని వాసవిమాత ఆలయంలో సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు చింత శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



కేక్ కట్ చేస్తున్న మేరు సంఘం నాయకులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా మేరు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మేరు సంఘం నాయకులు మాడిశెట్టి మల్లేశం, రాగిల్ల నారాయణ, గణేశ్, రాము, ప్రశాంత్, మహేశ్, రమేశ్, హన్మాండ్లు, ఓదెల గంగాధర్ పాల్గొన్నారు.

మల్యాలలో..

మల్యాల: మండల కేంద్రంలోని టైలరింగ్ దుకాణాల యజమానులు, కార్మికులు మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. బాలె సంజీవ్, రామగిరి మురళి, మాడిశెట్టి నగేశ్, చిలువేరు గంగాధర్, రామగిరి గౌరయ్య, దూలం సత్యం, నరేశ్, అశోక్, సత్తయ్య, కనకరాజం, శివకుమార్ పాల్గొన్నారు.